సాక్షి విశాఖపట్నం

శనివారం | 5 | అక్టోబర్ | 2024


ధనలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి 6లో


సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం 6లో


ఇసుక కొరతతో వీధిన పడ్డ కార్మికులు 6లో



లడ్డూలో కాదు.. కూటమిలోనే కల్తీ



సుప్రీం నిర్ణయం చంద్రబాబుకు చెంపపెట్టు



- లడ్డూ వ్యవహారం సీబీఐకి అప్పగించడంపై సర్వత్రా హర్షం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశం
- భగవంతుడ్ని రాజకీయాల్లోకి లాగడంపై ధర్మాసనం ఆగ్రహం
- సుప్రీం నిర్ణయంతో ఉలిక్కిపడుతున్న కూటమి నేతలు
- తప్పు జరిగితే దేవుడే చూసుకుంటాడంటున్న సామాన్యులు
- రాజకీయ లబ్ధి కోసం దేవుడ్ని వాడుకోవడంపై మండిపాటు

పవిత్రమైన తిరుపతి లడ్డూను రాజకీయ దురుద్దేశంతో అపవిత్రం చేశారు. వందరోజుల పాలన వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు విష రాజకీయాలకు తెరతీశారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిపేశారంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి. రెండు రోజుల తర్వాత.. కల్తీ నెయ్యి అనీ.. మరికొద్ది రోజుల తర్వాత.. లడ్డూలో కలవలేదనీ.. కలవకుండా ఆపేశామంటూ పూటకోమాట మార్చేస్తూ.. భక్తుల మనోభావాలతో రాజకీయ చదరంగమాడారు. దీనిపై నిష్పాక్షికమైన దర్యాప్తు జరిపించాలంటూ వైఎస్సార్‌సీపీ తరఫున రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చంద్రబాబు, అండ్ కో చేసిన వ్యాఖ్యలపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి ఆధారాల్లేకుండా.. దేవుడిని రాజకీయాల్లోకి లాగారంటూ మండిపడింది. చేసిన తప్పుడు వ్యాఖ్యల్ని సమర్థించుకునేందుకు కూటమి ప్రభుత్వం.. రాష్ట్ర పోలీసులతో సిట్ పేరుతో ఆడాలనుకున్న నాటకాలకు ధర్మాసనం స్వస్తి పలికింది. లడ్డూ వ్యవహారం సీబీఐకి అప్పగించి.. స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కుటిల స్వార్థంతో భగవంతుడిని రాజకీయాల్లోకి లాగారంటూ ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. సుప్రీం నిర్ణయం చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని అభిప్రాయపడుతున్నారు. తప్పు జరిగితే దేవుడే చూసుకుంటాడని.. తప్పుడు ఆరోపణలు చేసినా.. ఏడుకొండల వాడు విడిచి పెట్టరంటున్నారు. మతజ్వాలలు రగిలించిన ప్రభుత్వ వ్యవహారంపై చిన్నా పెద్దా తేడాలేకుండా.. యావత్ ప్రజలు ఆగ్రహిస్తున్నారు. అసలు లడ్డూలో కల్తీ లేదని.. కూటమి ప్రభుత్వం చేసిన విషప్రచారంలోనే ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

– సాక్షి, విశాఖపట్నం

శివుడు కూడా సహించడు



తిరుపతి వెంకన్న లడ్డూ అంటే అది దివ్యప్రసాదం. ఒకసారి స్వామికి నివేదించాక అది అమృతం కన్నా గొప్పది. దేవతలు మనంపెట్టే నైవేద్యాలను ఆఘ్రాణ రూపంగా ఆరగిస్తారని శాస్త్రాలు చెపుతాయి. అటువంటి గొప్ప ప్రసాదం మీద కల్తీ అనే అపవాదు వ్యాపింపజేయడం గొప్ప అపచారం. దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా సమయోచితంగా స్పందించింది. పరమ పవిత్రమైన లడ్డూపై జరిగిన దుష్ప్రచారాన్ని చంద్రచూడుడు (శివుడు) మాత్రం సహిస్తాడా??

– బులుసు వేంకటేశ్వర్లు, ప్రముఖ పద్యకవి, తగరపువలస

బాబు ఆరోపణలు తగవు



తిరుమల లడ్డూ విషయంలో వైఎస్సార్ సీపీ స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయాలని ఆది నుంచి కోరింది. సుప్రీంకోర్టు కూడా ఫైవ్‌మెన్ కమిటీతో విచారణ చేపట్టాలని ఆదేశించింది. స్వతంత్ర దర్యాప్తుతోనే వాస్తవాలు బయటకు వస్తాయి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఈ విషయంపై ఆరోపణలు చేయడం సమంజసం కాదు.

– గొలగాని హరి వెంకటకుమారి, విశాఖ నగర మేయర్

నిజం నిగ్గు తేలుతుంది



రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌పై హిందువులెవరికీ నమ్మకం లేదు. ఒక స్వతంత్ర ఏజెన్సీ ద్వారా దర్యాప్తు జరపాలని వైఎస్సార్‌సీపీ తొలి నుంచి డిమాండ్ చేస్తోంది. శ్రీవారి లడ్డూపై వచ్చిన ఆరోపణలపై నిజనిజాలు తేల్చేందుకు స్వతంత్ర దర్యాప్తు చేయాలని సుప్రీం ఇచ్చిన ఆదేశాలను యావత్ హిందువులు స్వాగతిస్తున్నారు. మాపార్టీ నుంచి టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తు చేయించాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నిర్ణయం స్వాగతిస్తున్నాం.

– గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, విశాఖ

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుంటే బావుంటుంది



ఈ మధ్య మా మిత్రులతో కలిసి భద్రాచలం వెళ్లాం. అక్కడ ప్రసాదం తినే ముందు సీఎం చంద్రబాబు దుర్బుద్ధితో చేసిన కల్తీ లడ్డూ ప్రకటన గుర్తుచేసుకొని బాధపడ్డాం. ప్రత్యేక దర్యాప్తు బృందం ఐదుగురితో ఏర్పాటు చేసిన బృందంలో ఏపీకి చెందిన ఇద్దరు పోలీస్ అధికారులకు బదులుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఉంటే బావుంటుంది. సిట్ విచారణ చేయడానికి సుప్రీంకోర్టు కాలపరిమితి విధించాలి.

– జీవీఎన్ సంజయ్, సాఫ్ట్ వేర్ ఆపరేషన్ మేనేజర్

చంద్రబాబు ప్రకటన ఆవేదనకు గురిచేసింది



నేను మూడేళ్ల నుంచి తిరుమల వెంకటరమణమూర్తి గోవింద మాల వేస్తున్నాను. తిరుమల లడ్డూ ప్రసాదం జంతువుల కొవ్వుతో కల్తీ చేశారనే చంద్రబాబు ప్రకటన చాలా ఆవేదనకు గురిచేసింది. ఆధారం లేకుండా ముఖ్యమంత్రిగా ఎలా బహిరంగ ప్రకటన చేశారని చంద్రబాబును సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించిన తర్వాత కాస్త మనసు కుదుటపడింది. దర్యాప్తులో ఏ రాజకీయ పార్టీది తప్పని తేలితే ఆ పార్టీ గుర్తింపు రద్దు చేయాలి.

– మజ్జి రవికుమార్, తిరుమల గోవింద మాలధారుడు

ఫైవ్‌మెన్ కమిటీని స్వాగతిస్తున్నా..



తిరుమల తిరుపతి లడ్డూ విషయంలో విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు వ్యాఖ్యలు స్వాగతిస్తున్నాం. విచారణకు సంబంధించి ఫైవ్‌మెన్ కమిటీతో నిజాలు బయటపడతాయన్న ఆశ ఉంది. కోట్లాది మంది హిందువులు..శ్రీవారి భక్తుల మనోభావాలను చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ దెబ్బతీశారు. సనాతన ధర్మం కోసం పవన్‌కల్యాణ్ మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉంది.

– వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త

ప్రజల దృష్టిని మళ్లించేందుకే..



తెలిసితెలిసి కలియుగ దైవం వేంకటేశ్వరస్వామితో ఆడుకుంటే వారికి మామూలుగా పాపం అంటదు. వంద రోజుల ప్రభుత్వ పాలనలో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కల్తీ లడ్డూ వివాదం కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది. చివరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను తిరుమల రాకుండా మతం రంగు పులిమి అడ్డు తగిలారు. సుప్రీంకోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అయింది.

–దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు, ఎంపీపీ, భీమిలి

చంద్రబాబును బహిష్కరించాలి



హిందూ ధర్మ పరిరక్షణే మూల సిద్ధాంతంగా పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం బీజేపీ మెజార్టీ హిందువుల ఓట్లతో మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. హిందువుల మనోభావాలను కించపరిచేలా చంద్రబాబు తిరుపతి లడ్డూపై వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యక్తిని ఎన్‌డీఏ కూటమి నుంచి బహిష్కరించాలి. సుప్రీంకోర్టు ఆదేశించిన ప్రత్యేక దర్యాప్తు బృందం నిజాయితీగా దర్యాప్తు చేయాలలి

– వాసు, జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్



విశాఖకు చెందిన హేమలతా రెడ్డి గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా -2024 విజేతగా నిలవగా పలువురు అభినందనలు తెలిపారు. - 6లో

రూ.63,266 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

- విడుదల చేసిన కలెక్టర్ హరేందిర ప్రసాద్
- వ్యవసాయ రంగానికి రూ.7,108 కోట్ల కేటాయింపు



వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, అధికారులు, బ్యాంకర్లు

మహారాణిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.63,266.10 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూపొందించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో వివిధ రంగాల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఈ ప్రణాళికను విడుదల చేశారు. ఇందులో ప్రాధాన్య రంగాలకు రూ.23,090 కోట్లు, ఇతర రంగాలకు రూ.40,176.59 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.7,108 కోట్లతో పెద్దపీట వేశారు. విద్యాపరమైన అవసరాలకు రూ.294 కోట్లు, గృహ నిర్మాణ అవసరాలకు రూ.1,355 కోట్లు కేటాయించారు.

జిల్లాలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, ఎంఎస్‌ఎంఈ, విద్యా రుణాలు, గృహ రుణాలు, స్వయం సహాయ సంఘాలు మొదలైన వాటికి అధిక ప్రాధాన్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రంగాలకు ఫైనాన్సింగ్‌తో పాటు జిల్లా స్థూల విలువ జోడించి రెండంకెల వృద్ధిని సాధించడంలో.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ ప్రణాళిక దోహదపడుతుందన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పని చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రోత్సహించేలా, రైతులకు అండగా నిలిచేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలని సూచించారు.

ప్రభుత్వ సంస్థలు, పౌరుల నుంచి రుణాల నిమిత్తం వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత కాలంలో సాయం అందించాలన్నారు. రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అమలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో ఎల్‌డీఎం ఎం.శ్రీనివాస్, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి పి.పూర్ణిమ, నాబార్డు డీడీఎం జి.ఆర్.సమంత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, వివిధ విభాగాల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

జూ క్యూరేటర్‌కు బదిలీ



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాకు బదిలీ అయింది. రాష్ట్రంలో ఐ.ఎఫ్.ఎస్. అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నందనీ సలారియాను ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. ఈమె 2020లో కాకినాడ డీఎఫ్‌వోగా పనిచేసి విశాఖ జూ క్యూరేటర్‌గా బదిలీపై వచ్చారు. సుమారు నాలుగేళ్లపాటు పనిచేశారు. ఆమె స్థానంలో ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు.

లడ్డూ విక్రయాల నిలిపివేత

కొమ్మాది : రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం నుంచి వచ్చే శనివారం వరకు శ్రీ వారి లడ్డు విక్రయాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ లడ్డు విక్రయాలు వారం రోజులు పాటు నిలిపివేశామని, తిరిగి బ్రహ్మోత్సవాలు తరువాత లడ్డూ విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గ్రిడ్ వైఫల్యంతో జరిగిన విద్యుత్ అంతరాయం వల్ల మిల్స్, కొన్ని విభాగాల్లో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అయితే స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ) విభాగంలో తయారైన విద్యుత్‌ను వినియోగించడం వల్ల ప్రధాన విభాగాల్లో ఉత్పత్తి నిరాటంకంగా కొనసాగింది.

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గ్రిడ్ నుంచి స్టీల్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఆ విద్యుత్‌ను స్టీల్‌ప్లాంట్ టీపీపీ విభాగంలో తయారయ్యే విద్యుత్‌తో అనుసంధానం చేసి ప్లాంట్ విభాగాలకు వినియోగిస్తారు. మధ్యాహ్నం 12.45 సమయంలో గ్రిడ్ వైఫల్యం చెందడంతో బయట నుంచి వచ్చే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

దీంతో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్, ప్లాంట్‌లోని మిల్స్‌తో పాటు అనేక విభాగాల్లో విద్యుత్ నిలిచిపోయింది. టీపీపీ విభాగంలో తయారయ్యే విద్యుత్ వల్ల కోక్ ఓవెన్స్, బ్లాస్ట్‌ఫర్నేస్, స్టీల్ మెల్ట్ షాప్ విభాగాలు ఆటంకం లేకుండా ఉత్పత్తి జరిగింది. సాయంత్రం 4.20 సమయంలో విద్యుత్ పునరుద్ధరించడంతో మరలా అన్ని విభాగాల్లో పనులు ప్రారంభించారు.

డీఆర్‌డీఏ పీడీగా లక్ష్మీపతి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీపతి

ఎంవీపీకాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీగా బి.లక్ష్మీపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మీపతిని పీడీగా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

దేశమంతా ఒకే ఎన్నిక మంచిదే.. కానీ.!

- యూపీఎస్‌సీ పూర్వ సభ్యుడు చలం


మాట్లాడుతున్న కె.ఎస్.చలం

విశాఖ సిటీ: దేశమంతా ఒకే ఎన్నిక మంచిదే.. అయితే దేశంలోని విభిన్న జాతులను పరిగణలోకి తీసుకొని ఒకే ఎన్నిక అనే అంశం ఎంత వరకు విజయవంతం అవుతుందో ఆలోచన చేయాలని యూపీఎస్‌సీ పూర్వ సభ్యుడు కె.ఎస్.చలం సూచించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనేక అంశంపై శుక్రవారం ఏయూలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వాలు ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించాయే తప్పా.. విభిన్న జాతులను ఒకే జాతిగా తీర్చిదిద్దడంలో సఫలం చెందలేదన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను అమలు చేసే ముందు ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఐఐపీఏ ప్రధాన కార్యదర్శి ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ రొక్కం సుదర్శనరావు అధ్యక్షత వహించగా.. డాక్టర్ హరిబాబు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వీర్రాజు పాల్గొన్నారు.

నేడు కేంద్ర, రాష్ట్రమంత్రుల రాక

మహారాణిపేట: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ శనివారం విశాఖ వస్తున్నారు. తిరుపతి నుంచి విమానంలో శనివారం సాయంత్రం రామ్మోహన్‌నాయుడు విశాఖ చేరుకుంటారు. కళాభారతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్ర మంత్రి దుర్గేష్ రాజమండ్రి నుంచి రోడ్డు మార్గంలో 10.30 గంటలకు రాడిసన్ హోటల్‌కు చేరుకుంటారు. గోల్ఫ్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తారు.

ఇసుక కొరతతో వీధిన పడిన కార్మికులు

- ఉచిత ఇసుక ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుంది
- సీపీఎం కార్యదర్శి జగ్గునాయుడు హెచ్చరిక


సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరా పేరుతో కార్మికులను వీధిన పడేసిందని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని, ప్రజలు కొందామంటే ఇసుక దొరకడం లేదన్నారు. జిల్లాలో నిర్మాణాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని, 50 వేల మంది కార్మికులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో టన్ను ఇసుక ధర రూ.1,070 ఉండేదని.. ప్రస్తుతం రూ.2,300కి చేరడం దారుణమన్నారు. సిమెంట్ బస్తా రూ.370 ఉంటే ఇసుక బస్తా రూ.300–రూ350 ఉందన్నారు. ఆన్‌లైన్‌లో ప్రజలు బుకింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది కానీ.. ఈ బుకింగ్ రాజకీయ అధికార అండతో ఇసుక మాఫియాకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. రాత్రికి రాత్రి వీరు బుక్ చేస్తూ.. సాధారణ మధ్యతరగతి ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని భీమిలి, అగనంపూడి డిపోల్లో ఇసుక లేదని.. రాజమండ్రి, శ్రీకాకుళం నుంచి కూడా ఇసుక రావడం లేదన్నారు. దీంతో నిర్మాణాలు ఆగిపోయి నిర్మాణ రంగంపై ఆధారపడిన వారందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి ఆచరణకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని.. 100 రోజులు గడిచినా ఆ ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక ఇవ్వకుండా, సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయకుండా మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇసుకపై ఇచ్చిన మాటకు కట్టుబడకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.జగన్ అధ్యక్షత వహించగా.. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావు, ఆర్కేఎస్‌వీ కుమార్, బి.ఈశ్వరమ్మ, జిల్లా నాయకులు బి రమణ, ఎం.సుబ్బారావు పి.పైడిరాజు, ఎ.నరేంద్ర కుమార్, అప్పలరాజు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.అనసూయ, శ్రీనివాసరావు, బి.వెంకటరావు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, ఆదినారాయణ, నరసింగరావు, గోపాలకృష్ణ, మల్లేష్, రమణ, లక్ష్మణరావు, రామకృష్ణ, పెంటారావు, పోలారావు, ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ తనిఖీ బృందాల సర్వీస్ నిలిపివేత


స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తనిఖీ బృందాల సర్వీస్‌ను నిలిపివేస్తూ జీవీఎంసీ స్థాయీ సంఘం నిర్ణయం తీసుకుంది. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు గతేడాది జీవీఎంసీ తనిఖీ బృందాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే నూతనంగా ఏర్పడిన స్థాయి సంఘ సభ్యులు ఆ తనిఖీ బృందాల సర్వీస్‌ను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మేయర్, స్థాయి సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 124 అంశాలతో పాటు 19 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తంగా 143 అంశాలను సభ్యులు చర్చించారు. ఇందులో 12 అంశాలు వాయిదా వేశారు. అనకాపల్లి మార్కెట్‌కు సంబంధించి అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. అజెండాలో 118వ అంశంగా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తనిఖీ బృంద సభ్యుల జీతాలు ఆమోదిస్తూ.. తనిఖీ బృందాల సర్వీస్ నిలుపుదల చేస్తున్నట్టు తీర్మానించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.31.56 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రూ.55.22 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. జీవీఎంసీ కార్యదర్శి ఎంవీడీ ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

మహిళా ఖైదీలకు వితరణ


మహిళా బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన శానిటరీ నేప్కిన్ వెండింగ్ మెషీన్‌తో ఫౌండేషన్ ప్రతినిధులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని శుక్రవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించారు. ఇక్కడ మహిళా ఖైదీలకు అవసరమయ్యే శానిటరీ నేప్కిన్ వెండింగ్ మెషీన్‌ను జైలు అధికారులకు అందజేశారు. ఈ మెషీన్‌ను వెంటనే మహిళా ఖైదీల బ్లాక్ వద్ద అధికారులు అమర్చి.. ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్, జైలర్లు, ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ కుమారి, గీతా శ్రీకాంత్, రమా రాజ్‌గోపాల్, వాణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి


లక్ష చామంతుల పూజలో ధనలక్ష్మిగా కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశ స్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. లక్ష చామంతులతో పూజ చేశారు. లక్ష చామంతుల పూజ అలంకరణ దాతలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని, లడ్డూలతో పూజ నిర్వహిస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు గర్భాలయ ప్రవేశం లేదన్నారు. ఆర్జిత సేవలను కూడా రద్దు చేశామన్నారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన ఏయూ విద్యార్థులకు నోటీసులు

15 రోజులు సస్పెండ్ చేయనున్నట్లు రెక్టార్ వెల్లడి

ఎంవీపీకాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యవహారంపై యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు దిశగా ముందడుగేసింది. ర్యాగింగ్‌కు పాల్పడిన ఆర్కిటెక్చర్ సీనియర్ విద్యార్థులకు నోటీసులిచ్చింది. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు 15 రోజుల పాటు వారిని వర్సిటీ నుంచి సస్పెండ్ చేయనున్నట్లు వెల్లడించింది. వర్సిటీ ఆర్కిటెక్చర్ విభాగానికి చెందిన సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. జూనియర్ విద్యార్థినులతో డ్యాన్స్‌లు చేయిస్తూ వీడియోలు చిత్రీకరించారు. వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల మహిళా వసతిగృహంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మీడియా ద్వారా ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఏయూ అధికారులు అప్రమత్తమయ్యారు. రాత్రి ఒక టీమ్‌ను హాస్టల్‌కు పంపించి నిరారించుకోవడంతో పాటు సీనియర్ విద్యార్థులను మందలించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు శుక్రవారం సమీక్షించగా.. రెక్టార్ కిశోర్‌బాబు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఈశ్వర్‌కుమార్, రేవతి విభాగ విద్యార్థులతో సమావేశమయ్యారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులకు నోటీసులు ఇవ్వడంతో పాటు వారి వ్యవహార శైలిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. 15 రోజుల పాటు వారిని సస్పెండ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రెక్టార్ వెల్లడించారు.

వార్డుల్లో పడకల సంఖ్య పెంపునకు చర్యలు

- కేజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్


రాజేంద్రప్రసాద్ వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కేజీహెచ్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం కేజీహెచ్‌కు వెళ్లిన ఆయన ముందుగా వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఉద్యోగుల విధి నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లల వార్డును సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. ఆధునికీకరణ, ఇతర పనుల గురించి కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఇతర వైద్యాధికారులతో మాట్లాడారు. ఖైదీలకు కేటాయించిన బెడ్లు సరిపోవడం లేదని ఇటీవల కేంద్ర కారాగారం సందర్శనలో అక్కడి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయమై అధికారులతో చర్చించారు. రాజేంద్రప్రసాద్ వార్డులో ఇప్పుడున్న బెడ్ల సంఖ్యను పెంచాలని, ఖైదీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వార్డులను పరిశీలించారు. వైద్య సేవల విస్తరణ, వసతుల కల్పన, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏఎంసీ యూనిట్–2 కౌన్సెలింగ్ రూమ్‌ను కూడా కలెక్టర్ సందర్శించారు. పర్యటనలో ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, డీఈఈ మన్మథరావు ఉన్నారు.

సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- 13న కొండదిగువ జమ్మివేట ఉత్సవం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం శ్రీ రామాయణ నవరాత్రి పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్ఠింపజేసి.. ఆలయ బేడా మండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఈ నెల 12వ తేదీ వరకు ప్రతీ రోజూ ఉదయం స్వామి సన్నిధిలో రామాయణ పారాయణం, సాయంత్రం అమ్మవార్లకు తిరువీధి ఉంటుందని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 12 వరకు ఆలయంలోని సింహవల్లీ తాయారు సన్నిధిలో వీరలక్ష్మీ ఆరాధనం, మూల పూజలు నిర్వహిస్తామన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఈ నెల 13న సాయంత్రం కొండదిగువ స్వామి పూలతోటలో జమ్మివేట ఉత్సవం నిర్వహిస్తామని, ఆ రోజు స్వామి రామాలంకరణలో దర్శనమిస్తారన్నారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకే సింహగిరిపై ఉన్న స్వామి వారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని వివరించారు.

ఆధిక్యంలో అంగద్

- సత్తాచాటుతున్న అమన్
- పోటీపడుతున్న కార్తీక్, అమర్, యుషాస్


అంగద్ చీమా


అమన్ రాజ్

విశాఖ స్పోర్ట్స్: ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో వైజాగ్ ఓపెన్–2024 పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. చండీగఢ్‌కు చెందిన అంగద్ చీమా మూడో రౌండ్‌లో నాలుగు షాట్లతో ఓవర్ నైట్ లీడర్‌గా నిలిచాడు. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన మూడో రౌండ్‌లో అండర్1(70) పోస్ట్ చేయడంతో ఆఖరి హోల్‌పై ఎదురుదెబ్బ మినహా.. చివరి రౌండ్‌కు అండర్ 13(200)తో చేరుకున్నాడు. పాట్నాకు చెందిన అమన్‌రాజ్ అండర్2 (69)తో కలిపి మూడో రోజు–10(203)తో రెండో స్థానంలో నిలిచాడు. అలాగే గురుగ్రాంకు చెందిన కార్తీక్ శర్మ –7(64)స్కోర్‌తో, నోయిడాకు చెందిన అమర్‌దీప్ (65), మైసూర్‌కు చెందిన యుషాస్ చంద్ర(68)తో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. 34 ఏళ్ల అంగద్ ప్రస్తుత సీజన్‌లో ఆరు టాప్–10లతో పీజీటీఐ ర్యాంకింగ్‌లో నాలుగో స్థానంలో ఉన్నాడు. అద్భుతమైన షాట్లు, బర్డీలతో ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ రెండో టైటిల్ కోసం, మూడో రౌండ్‌లో నాలుగు బర్డీలు, డబుల్ బోగీలతో అమన్ రాజ్ తన 5వ టైటిల్ వేటకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా.. కార్తీక్ శర్మ మూడో రౌండ్‌లో ఏకంగా ఒక ఈగల్, ఏడు బర్డీలతో రెండు బోగీలు చేసి ఈ టోర్నీలో ఒక రౌండ్‌లోనే మెరుగైన స్ట్రయికింగ్‌తో టైటిల్ పోరులోకి దూసుకొచ్చాడు. డిఫెండింగ్ చాంప్ శ్రీలంకకు చెందిన తంగరాజు, జైరాజ్ సింగ్ 7(206) స్కోర్‌తో 7వ స్థానంతో చివరి రౌండ్‌కు సిద్ధమవుతున్నారు. ఆర్యన్, రాహుల్ గంగ్వీ, ధృవ్ షరోన్, హనీ బైషోయా, శివేంద్రసింగ్, సచిన్ అండర్ 6 స్కోర్లతో ఉమ్మడిగా 9వ స్థానంలో నిలిచి చివరి రౌండ్ ఆడనున్నారు.


మిసెస్ ఇండియా హేమలతా రెడ్డికి సత్కారం


హేమలతా రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట : విశాఖకు చెందిన హేమలతా రెడ్డి ఇటీవల మలేషియాలో జరిగిన గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా–2024 విజేతగా నిలిచారు. లోకల్ టీవీ, జెమిని టీవీలో యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన హేమలత.. ఆ తర్వాత ఎన్నో షోలు చేశారు. హ్యాపీడేస్ సీరియల్‌లో లీడ్ రోల్ చేసిన అనంతరం జగపతిబాబుతో ప్రవరాఖ్యుడులో నటించారు. నిన్నే చూస్తూ సినిమాలో హీరోయిన్ నటిస్తూ.. నిర్మాతగా వ్యవహరించారు. ఈ క్రమంలో మిసెస్ ఇండియా పోటీల్లో విశాఖ నుంచి ప్రాతినిథ్యం వహించారు. ప్రపంచ వ్యాప్తంగా 300 మందిలో విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా విశాఖవాసులు శుక్రవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం హేమలత మాట్లాడుతూ విశాఖ నాకు పుట్టినిల్లు అని, తల్లిదండ్రుల ఆశీస్సులతో నేడు ఈస్థాయిలో ఉన్నానని తెలిపారు. త్వరలో పారిస్ ఫ్యాషన్ వీక్‌కు వెళ్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ అమ్మాయి మిసెస్ ఇండియా కావడం గర్వకారణమన్నారు. పైడా కృష్ణ ప్రసాద్, గంట్ల శ్రీనుబాబు, కందుల నాగరాజు, వీరూమామ తదితరులను ఆమెను అభినందించారు.

తిరుపతిని చంద్రబాబు అపవిత్రం చేశారు

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



దాబాగార్డెన్స్: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతిని ముఖ్యమంత్రి చంద్రబాబు అపవిత్రం చేశారని.. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు లడ్డూ కోసం మాట్లాడి తప్పు చేశారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతికి బీజేపీ తీవ్రంగా నష్టం చేస్తోందని.. లడ్డూ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లడం దారుణమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల విషయంలో చేసిన వ్యాఖ్యలు బాగాలేవని.. ఆయన సిద్ధాంతంలోనే రాద్ధాంతం ఉందని వ్యంగంగా అన్నారు. చంద్రబాబు, కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్క సిక్స్ కూడా కొట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో రాజధాని కట్టడం వల్ల ముంపే తప్ప, మరొకటి ఉండదన్నారు. రాజధాని విషయంలో చంద్రబాబు పునరాలోచించాలన్నారు. పోలవరానికి పునాది వేసి 40 ఏళ్లయిందని, ఇంతవరకు ప్రాజెక్టు పూర్తి కాకపోవడం శోచనీయమన్నారు. చంద్రబాబు ఇంటి ముందు ధర్నా, ఆందోళనలు చేపడితే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగి తీరుతుందన్నారు. చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తే స్టీల్‌ప్లాంట్ రియల్ ఎస్టేట్‌గా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏ క్షణానైనా పడిపోవచ్చని చింతా జోస్యం చెప్పారు. ప్రధాని మోదీ, అమిత్‌షా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని.. ఆ మాటలే బీజేపీ పతనానికి నాంది అని అన్నారు.

తల్లిదండ్రుల సేవతోనే జీవితానికి సార్థకత


ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

బీచ్‌రోడ్డు: ప్రపంచంలోని ఎక్కడున్నా.. ఎంతటి బిజీ లైఫ్‌లో ఉన్నా తల్లిదండ్రులను మరిచిపోకూడదని అవధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో రోటరీ క్లబ్ విశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లోకకల్యాణార్థం దేవీ వైభవాన్ని తనదైన శైలిలోని ఆయన ప్రవచించారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ఎందరినో కలుస్తారని.. వారంతా కోపతాపాలు వస్తే మధ్యలోనే దూరమైపోతారన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా చివరివరకు కంటికి రెప్పలా చూసేవారు తల్లిదండ్రులేనన్నారు. సింహాచలం ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులు శేషస్వామి, రోటరీ విశాఖ ప్రతినిధి ఆర్జీఎస్ జగన్మోహన్, అధ్యక్షుడు బి.వినయగాంధీ, కార్యదర్శి బి.మణిమాల, కోశాధికారి ఎం.కె. కుమార్ పాల్గొన్నారు.

దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలి

అల్లిపురం: దసరా కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ సుతేజ్, జాయింట్ సెక్రటరీ బండారు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బి.శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు వెంకన్న పాత్రుడు ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఓ లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

సీఎన్‌జీ బజాజ్ ఫ్రీడమ్ 125 బైక్ ఆవిష్కరణ


బైక్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రభుకిశోర్

బీచ్‌రోడ్డు: ప్రపంచపు మొట్టమొదటి సీఎన్‌జీ బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125 విశాఖ మార్కెట్‌లోకి విడుదలైంది. సిరిపురంలోని వరుణ్ బజాజ్ షోరూంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్, బజాజ్ ఆటో రీజినల్ మేనేజర్ సర్వీస్ సచిన్ జైన్, ఏరియా సర్వీస్ మేనేజర్ ఎస్.భువనేష్, సేల్స్ మేనేజర్ అబాస్ శేఖరన్ ఈ బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుకిశోర్ మాట్లాడుతూ సరికొత్త బజాజ్ ఫ్రీడమ్ బైక్ గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందన్నారు. ఈ బైక్ ట్విన్ ట్యాంక్ సెటప్ కలిగి ఉందని.. ఒక ట్యాంక్ పెట్రోల్ కోసం, మరో ట్యాంక్ సీఎన్‌జీ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు చెప్పారు. ఇంధన ఆప్షన్‌ను ఎంచుకోవడానికి ప్రత్యేకంగా రెండు స్విచ్‌లను ఏర్పాటు చేశారన్నారు. డ్రమ్, డ్రమ్ ఎల్ఈడీ, డిస్క్ ఎల్‌డీ అనే మూడు వేరియంట్లలో బజాజ్ ఫ్రీడమ్ బైక్ అందుబాటులో ఉందన్నారు. ఎంట్రీ లెవల్ వేరియంట్ బజాజ్ ఫ్రీడమ్ 125 డ్రమ్ ఎక్స్ షోరూం ధర రూ.95,000, మిడ్ రేంజ్ వేరియంట్ డ్రమ్ ఎల్ఈడీ ఎక్స్ షోరూం ధర రూ.1.05 లక్షలు, టాప్ అండ్ వేరియంట్ డిస్క్ ఎల్‌డీ ఎక్స్ షోరూం ధర రూ.1.10 లక్షలుగా ఉందన్నారు. వరుణ్ బజాజ్ సీఈవో శ్రీనివాస్, వరుణ్ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

గంజాయి కేసులో తప్పించుకున్న నిందితుడి అరెస్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో గత నెల 28న పట్టుబడిన 21 కిలోల గంజాయి కేసులో ప్రధాన నిందితుడు అరదా శివకుమార్‌ను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఆ రోజు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శివకుమార్‌తో పాటు మరొకరిని అరెస్ట్ చేసి.. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అయితే ప్రధాన నిందితుడు పోలీసుల కళ్లుగప్పి అర్ధరాత్రి స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. దీంతో సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా.. శుక్రవారం అతను చిక్కాడు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్‌కు పంపింది.

వ్యాపారవేత్త అవయవదానం

మండపేట: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రెడ్డి కల్యాణ్ చక్రవర్తి అవయవాలను ఆయన కుటుంబం దానం చేసి ఆదర్శంగా నిలిచింది. రాజానగరం మండలం చక్రద్వార బంధం, తుంగపాడు వద్ద ఈ నెల 2న రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన.. కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యారు. చక్రవర్తి కుటుంబ సభ్యుల అంగీకారంతో కాకినాడ అపోలో వైద్యులు ఆయన గుండె, కళ్లు, కిడ్నీలు సేకరించారు. పోలీసు అధికారుల సహకారంతో గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక వాహనంలో విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి అవయవాలను తరలించారు. చక్రవర్తి పార్థివ దేహాన్ని మండపేట తీసుకువచ్చి.. ఏడిదలో దహన సంస్కారాలు నిర్వహించారు. చక్రవర్తి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

సీఈ, సీసీపీ బాధ్యతల స్వీకరణ

దాబాగార్డెన్స్: ఏపీ సీఆర్‌డీఏ నుంచి జీవీఎంసీకి ఇటీవల బదిలీపై వచ్చిన చీఫ్ ఇంజినీర్ శివప్రసాదరాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకరరావులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శిగా వరప్రసాద్

విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శిగా శెట్టి వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు వ్యవహరించారు.